ఆధార్‌తో బోగస్ ఓట్లకు చెక్

- 42 శాతం అనుసంధానం పూర్తి
- డబుల్ ఓట్లు, చీటింగ్‌కు నో చాన్స్
- ప్రక్రియతో తగ్గనున్న ఓట్లు
- మొత్తం ఓట్లు 4,75,623

మహేశ్వరం: ఇక ముందు జరిగే ఎన్నికల్లో దొంగ ఓట్లకు తావు ఉండదు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు వేసే ఆస్కారం ఉండదు. ఒకరి ఓటు మరొకరు వేశారనే ఆరోపణలు రావు. ప్రజా స్వామ్యానికి కారణభూతమైన ఓటు అమ్మకంలో వస్తువుగా నిలిచిపోవద్దనే సంకల్పంతో రాష్ట్ర ఎన్నికల సంఘం నక్లిలీల,ను ఏరి వేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే నియోజకవర్గంలో జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, కమ్యూనిటీ సహాయకులు, తదితర సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగిరం చేశారు. నియోజకవర్గంలో ప్రక్రియ 42 శాతం పూర్తయింది. 100 శాతం పూర్తి చేసేందుకు బీఎల్‌ఓలు(బూత్ లెవల్ అధికారులు) గ్రామాలు, పట్టణాల్లో విస్తృత పర్యటనలు చేస్తున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా..

ఓటరు జాబితాను పూర్తి పారదర్శకంగా తయారు చేసే దిశగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఒకే చోట రెండు, అంతకంటే ఎక్కువ ఓటు హక్కు కలిగిన వారిని తొలగించిన ఎన్నికల సంఘం.. దేశంలో ఎక్కడ ఉన్నా ఒకే చోట ఓటు హక్కును కలిగి ఉండేలా ఆధార్ అనుంధానానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలో కొన్ని నెలలుగా బూత్‌స్థాయిలో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు కార్డుకు ఆధార్ కార్డును అనుంధానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 42 శాతం పూర్తికాగా.. మిగతా వారు ముందుకొస్తే అసలు ఓట్ల సంఖ్య తేలే అవకాశముంది. ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం 2023లో భాగంగా తాజాగా ఎన్నికల సంఘం ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. ఇందులో మహేశ్వరం నియోజకవర్గంలో మహేశ్వరం మండలం-60,028, కందుకూరు -47,707, బాలాపూర్-2,53,994, సరూర్‌నగర్-1,15,894 మొత్తం నియోజకవర్గంలో 23-12-2022 నాటికి మొత్తం 4,75,623 ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో బాలాపూర్, సరూర్‌నగర్ మండలాల్లోని జల్‌పల్లి, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లతో పాటు సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లలో ఓటరు-ఆధార్‌కార్డు అనుసంధానం చేయడంతో అక్కడ డబుల్ ఓట్లు ఉన్న వారికి ఒక ఓటు తొలగించి ఒకే ఓటును ఉంచనున్నారు. నగరంలో స్థిరపడిన ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు సొంత గ్రామంలో ఓటు రాయించుకొని, నగరంలో మరొక ఓటు రాయించుకొని రెండు చోట్ల ఇదివరకు ఓటు వేసేవారు. ఇప్పుడు ఆధార్ అనుసంధానంతో ఒకే చోట ఓటు వేసే వీలుంటుంది.



ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌ఓలు

అనుసంధానం వేగిరం



ఓటరు-ఆధార్ అనుసంధానంతో నకిలీ ఓటర్లను ఏరివేయవచ్చు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధానం చేస్తున్నాం. ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నాం. మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాల్లో తహసీల్దార్లు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 42 శాతం పూర్తయింది. త్వరితగతిన ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. మండల అధికారులు నిత్యం బీఎల్‌ఓలతో వివరాలు సేకరిస్తున్నారు.

– సూరజ్‌కుమార్, ఆర్డీఓ, కందుకూరు డివిజన్

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది



సీసీ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని చైర్మన్ అబ్దుల్లా సాది చెప్పారు. పహాడీషరీఫ్ 13వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పహాడీషరీఫ్ గ్రామంలో రూ.3.10 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులు పూర్తయితే వాహనదారులకు ఎంతో వెసులుబాటుగా మారనుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పందెం పుష్పమ్మ, బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నాసర్ అవల్కీ, మహ్మదీయ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రతినిధులు హమీద్‌ఖాన్, ఖదీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ గంగా హాస్పిటల్, 11కేవీ గ్రీన్‌హిల్స్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ విద్యుత్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు, 11కేవీ యాదవనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారి రామకృష్ణ తెలిపారు.

బండి సంజయ్‌ని కలిసిన తూళ్ల



బండి సంజయ్‌తో తూళ్ల వీరేందర్ గౌడ్, మహేశ్వరం నేతలు

మహేశ్వరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, సిరిగిరిపురం సర్పంచ్ కాసుల సురేష్, మండల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని సంజయ్ అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణపై వీరేందర్ గౌడ్‌తో ఆయన చర్చించారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు చేయాలని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని నేతలకు బండి సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ రాఘవేంద్రనగర్ కాలనీ అసోసియేషన్ ఫేజ్-2 నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎనుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీపతి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శంకర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా కృష్ణయ్య, కోశాధికారిగా అశోక్‌కుమార్, అసోసియేట్ కార్యదర్శిగా వెంకటేశ్వర్లుతో పాటు నలుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ స్థానిక నాయకులు సిద్దాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

కందుకూరు: మండల పరిధిలోని కొత్తూర్ గేట్ వద్దనున్న హజ్రత్ చమన్ షావలీ దర్గా వద్ద సోమవారం సాయంత్రం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ముస్లింలతో కలిసి బోరు తవ్వే పనులకు పూజలు చేసి ప్రారంభించారు. అంతకముందు ముస్లింలు సులేమాన్, ఎంఏ సమీర్, ఎండీ దావూద్, ఖదీర్, ఆలీ, సర్వర్, అంజద్, షరీఫుద్దీన్ తదితరులు మంత్రికి స్వాగతం పలుకుతూ నోట్ పుస్తకాలను అందజేశారు. దర్గా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

హయత్‌నగర్: తమ కాలనీలో నెలకొన్న మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీవాసులు సోమవారం జలమండలి (హెచ్‌ఎండబ్ల్యూఎస్) అధికారి భగవంతరావుకు వినతిపత్రం సమర్పించారు. కాలనీలో పూర్తిస్థాయిలో మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయాలని, మంచినీటి సరఫరాను పెంచాలని కాలనీవాసులు ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దేవినేని రామ్మోహన్, వేణు పాల్గొన్నారు.

పాల ధర పెంచండి

యాచారం: పాల ధర పెంచి ఆదుకోవాలని మదర్ డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డిని కలిసి రైతులు విజ్ఞప్తి చేశారు. మాల్ కేంద్రం రైతులు మహేందర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, నర్సిరెడ్డి, సంపత్ రెడ్డి, శివరాంరెడ్డిలు నగరంలో సోమవారం మదర్ డెయిరీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాల ధర పెంచడంతో పాటు పాడి పశువుల కొనుగోలుకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. రైతుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన చైర్మన్ త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

గ్రంథాలయ సేవలను విస్తరిస్తాం

- పౌర పఠన మందిరాలను ఏర్పాటు చేస్తాం
- గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకట రమణారెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న వెంకట రమణారెడ్డి

బడంగ్‌పేట్: గ్రంథాలయాల సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయ భవనంలో సోమవారం పాలకవర్గంతో నిర్వహించిన సమీక్షలో 2023-24 సంవత్సరానికి గాను రూ.20.04 కోట్లతో సంస్థ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆలోచన మేరకు పౌర పఠన మందిరాలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అయే విధంగా అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతున్నామని, జిల్లా గ్రంథాలయంలో డిజిటల్ సేవలను అందుబాటులోకి తేనున్నామని తెలిపారు. శంషాబాద్, ఆమనగల్, షాబాద్, మంచాలలో గ్రంథాలయ భవన నిర్మాలను త్వరితగతిన పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పంతంగి మాధవి, కమటం రాధమ్మ, గునుగుర్తి నక్షత్రం, దిద్యాల జయమ్మ, డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, డీపీఆర్‌వో పద్మశ్రీ, జిల్లా వయోజన ఉప సంచాలకులు గణేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్ లైబ్రేరియన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాతృమూర్తి జ్ఞాపకార్థం.. స్మారక భవనాలు

ఉదారత చాటుకున్న రామిడి రాంరెడ్డి



భవనాన్ని తిరుమలనగర్ కాలనీవాసులకు అప్పగించిన రామిడి రాంరెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడకు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి సోమవారం తన మాతృమూర్తి రామిడి కళావతి 15వ వర్ధంతి సందర్భంగా.. ఆమె జ్ఞాపకార్థంగా.. తిరుమలనగర్-2 సంక్షేమ సంఘానికి 180 గజాల విస్తీర్ణంలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించి, కాలనీ సంక్షేమానికి ఇచ్చారు. అదే విధంగా గుర్రంగూడలోని గడ్డం ఎన్‌క్లేవ్‌లో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించి కాలనీవాసులకు అప్పగించారు. సుమారు రూ.50 లక్షలతో ఈ రెండు భవనాలను నిర్మించి, కాలనీ సంక్షేమ సంఘాలకు అందజేయడం పట్ల స్థానికులు రాంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లుగా రామిడి కళావతి ట్రస్ట్ పేరుతో రాంరెడ్డి.. బీఆర్‌ఆర్ ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసుల కోసం కమ్యూనిటి భవనం, తిరుమలనగర్ ఫేస్-3లో కాలనీవాసులకు సంక్షేమ భవనం, శ్రీశ్రీ హోమ్స్‌లో కమ్యూనిటీ హాలును, వినాయకహిల్స్‌లో కాలనీ సంక్షేమ భవనాన్ని నిర్మించి అప్పగించారు. ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న రాంరెడ్డికి ప్రజలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి

పార్టీ యూత్ అధ్యక్షుడు పవన్‌కుమార్



పవన్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా మీర్‌పేట కార్పొరేషన్ 10వ డివిజన్ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సబితారెడ్డి పవన్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం పవన్ మాట్లాడుతూ యువతను ఏకంచేసి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మంత్రి చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మంత్రి సబితారెడ్డి, పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట ఓల్డ్ విలేజ్‌కు చెందిన 40 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

వనస్థలిపురం: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వనస్థలిపురం ఎస్‌ఐ రవి, ట్రాఫిక్ ఎస్‌ఐ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ... ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేటప్పుడు తక్కువ ధరల్లో వస్తున్నాయని నకిలీ వెబ్‌సైట్‌లలో వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు తెలియజేసి మోసపోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని, ఫేక్ మెసేజ్‌లను నమ్మవద్దని, లోన్ యాప్‌ల బారిన పడవద్దని చెప్పారు. ఉద్యోగం ఇస్తాం అంటూ మెసేజ్‌స్ చేసి డబ్బులు కట్టమనే వారిని మోసగాళ్లుగా గుర్తించాలని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చన్నారు. ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు తమ ఆట, పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గలత, పీసీ వెంకట్, హోంగార్డు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం

మాడ్గుల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి కృషి అభినందనీయమని కల్వకుర్తి అభివృద్ధి సాధన కమిటీ చైర్మన్ యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. మండలంలోని అవురుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ పద్మారెడ్డి తన తండ్రి గౌరవరం యాదవరెడ్డి స్మారకార్థం నిర్మించిన కళావేదికను సోమవారం ఎంపీపీ, ప్రజాప్రతినిధులు తల్లి సుగుణమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుగౌడ్ పాఠశాల అభివృద్ధికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా కార్యదర్శి పాండుగౌడ్, ఎంపీటీసీ సభ్యులు నారమ్మ, సర్పంచ్‌లు లక్ష్మయ్య, జంగయ్య, ఎంపీడీఓ రాఘవులు, ఎంపీఓ వేజన్న, సింగిల్‌విండో డైరెక్టర్లు వెంకటయ్యగౌడ్, జగన్‌గౌడ్, పూర్వ విద్యార్థి సురేశ్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు రాములు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణకు పెద్దపీట

- పెద్ద చెరువు బ్యూటిఫికేషన్‌కు రూ.4 కోట్లు
- దేవతలగుట్టపై 30 అడుగుల ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ
- విగ్రహ ఏర్పాటు నా పూర్వజన్మ సుకృతం
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి వెల్లడి



బాలాపూర్‌లో చెరువు సుందరీకరణకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: చిన్న గ్రామాలు నేడు పట్టణీకరణ చెందాయి. చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని చెరువుల సుందరీకరణకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి చేస్తుందని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ పెద్ద చెరువును రూ.4 కోట్లతో (హెచ్‌ఎండీఏ నిధులు) సుందరీకరణ చేస్తున్నారు. కార్యక్రమానికి మంత్రి పాల్గొని సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. చెరువులు, కుంటలు ఎక్కడ అన్యాక్రాంతం కాకుండా చూడాలని, వర్షాకాలం రాకముందే సుందరీకరణ పనులు పూర్తి చేయాలని సంబంధిత, హెచ్‌ఎండీఏ అధికారులను ఆదేశించారు. మీర్‌పేట కార్పొరేషన్‌లోని చందన చెరువు సుందరీకరణతో పాటు వాకింగ్ ట్రాక్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, అలాగే మంత్రాల చెరువు పనులు జరుగుతున్నాయని తెలి పారు. పోచమ్మకుంట, కోమటికుంట, గుర్రంగూడ, కుర్మల్‌గూడ చెరువుల పనులు చురుగ్గా సా గుతున్నాయని చెప్పారు. వాకింగ్‌ట్రాక్‌తో పాటు ఉదయం, సాయంత్రం పర్యాటకులు వచ్చి సేద తీరేలా చక్కని ఆహ్లాదాన్ని పంచేలా ఏర్పాట్లు చేస్తు న్నాం అని వెల్లడించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటి మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

విగ్రహానికి భూమి పూజ

దేవతలగుట్టపై 30 అడుగుల హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటుకు మంత్రి వేద మంత్రాల మధ్య భూమిపూజ చేసి మాట్లాడారు. విగ్రహ ప్రతిష్ఠాపన నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాని చెప్పారు. విగ్రహ ఏర్పాట్లు తన సొంత నిధులతో చేయిస్తున్నట్లు వెల్లడించారు. మహేశ్వరం పేరుతో ఉన్నటువంటి మహేశ్వరుడికి నియోజకవర్గంలోని కేసీ తండాలో భారీ పరమేశ్వరుని విగ్రహం తన చేతుల మీదుగా నిర్మించడం ఆ భగవంతుడు నాకు ఇచ్చిన పుణ్యఫలం అని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, డిప్యూటి మేయర్ ఇబ్రాం శేఖర్, దేవతల గుట్ట పరిరక్షణ సమితి సభ్యులు కళ్లెం నిరంజన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మదన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యులు రఘునందన్‌చారి, ఖలీల్‌పాషా, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, హరిగౌడ్, అశ్విన్‌రెడ్డి, సాంబశివ, శ్రీనివాస్‌యాదవ్, మాధవరెడ్డి, పద్మ, గీత తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్, సుల్తాన్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ యువకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి సమక్షంలో సోమవారం సుమారు 40 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి నర్సింహారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం పార్టీకి చెందిన యువకులను బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలోకి కలుపుకొన్నారని, స్వేచ్ఛలేని పార్టీల్లో ఇముడలేక యువకులు తిరిగి సొంత గూటికి చేరారని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీ వలన ప్రజలకు ఒరిగేది ఏమిలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, పార్టీలో చేరినవారిలో సురేష్ రాజ్, నరేష్, అఫ్జల్, ప్రవీణ్, రియాసత్, మహేష్, శ్రీకాంత్‌నాయక్, శ్రీనునాయక్, రామచంద్రనాయక్, తరుణ్, వంశీ, పాండు, అనీల్, సంజయ్ పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడండి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామంలో విస్‌సిటీ వెంచర్‌లో ప్రభుత్వానికి అప్పగించిన భూమిని కాపాడాలని కౌన్సిలర్ సుజాత, విఠాయిపల్లి గ్రామ యువజన సంఘాల నాయకులు కోరారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్‌ను కలిసి ఈమేరకు వారు వినతి పత్రం అందజేశారు. విస్‌సిటీ వెంచర్ నిర్వాహకులు వెంచర్ చేసిన సమయంలో మున్సిపాలిటీకి పార్కు స్థలం అప్పగించారని ఇప్పుడు అదే స్థలాన్ని చదునుచేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడాలని.. స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. యువజన సంఘాల నాయకులు.. సబావత్ రాములు, శ్రీధర్‌నాయక్, శంకర్, రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

ఎల్బీనగర్: కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి ఆయా కాలనీలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనానికి జరుగుతున్న మరమ్మతు పనులను సోమవారం కాలనీ వాసులతో కలసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



మీర్‌పేట: చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



మహేశ్వరం: సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

మీర్‌పేట: దేశ స్వాతంత్ర్యం కోసం సుభాష్ చంద్రబోస్ అలుపెరుగని పోరాటం చేశారని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నేతాజీ జయంతి సందర్భంగా మీర్‌పేట కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలకుర్తి వేణుగోపాల్‌రెడ్డి, గంగుల రంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు భిక్షపతిచారి, భీంరాజ్, వికీకసాగర్, కృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి

మహేశ్వరం: మండల కేంద్రంలో బీఆర్.అంబేద్కర్, జగ్జీవన్ రామ్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ఏబీవీపీ నాయకులు అన్నారు. నేతాజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు పయనించాలన్నారు. స్వాతంత్ర్య సమరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివకుమార్, రాఘవేందర్, సింధు, ప్రసాద్, విజయ్, చంటి పలువురు పాల్గొన్నారు.

డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

కార్పొరేటర్ శ్రీవాణి



కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. సోమవారం డివిజన్ పరిధి చెరుకుతోటకాలనీ, సాయికృష్ణానగర్ కాలనీలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. కొద్ది రోజులుగా డ్రైనేజీ రోడ్లపై పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పన్నులు సకాలంలో చెల్లిస్తున్న ప్రజలకు మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, స్వచ్ఛత కోసం అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాలనీల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి సమస్యలు కాలనీవాసులను వేధిస్తున్నాయని, కాలనీల్లో ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు, నాయకులు ఘంటి కిరణ్‌రాజ్, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు నిర్మించి ఇవ్వండి

బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్

యాచారం: పేదలందిరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి నిర్మించకుండా టీఆర్‌ఎస్ సర్కార్ మాట తప్పిందని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆరోపించారు. తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ గ్రామాల మధ్యన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద మొదట ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో వందలాది మంది పేదలు సొంత గూడు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వని పరిస్థితుల్లో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసి ఇంటి నిర్మాణాల కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శాంతికుమార్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షుడు పత్తి రాజు, శ్రీనాథ్, నాయకులు పాల్గొన్నారు.